

దోమా.. దోమా.. కుట్టకే..!



అనాఫిలస్ దోమ



మలేరియా వ్యాధి కారణంగా ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు ఆరు లక్షల మంది మరణిస్తున్నారని 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' అంచనా. ప్రతి రెండు నిముషాలకో శిశువు మలేరియా వల్ల మరణిస్తున్నట్లు చెబుతోంది. ప్రపంచంలో ఆఫ్రికా ఖండంలోని దేశాల్లో ఈ వ్యాధి ఎక్కువ ఉంది. భారతదేశంలో ఒడిశా, చత్తీస్‌ఘఢ్, పశ్చిమబెంగాల్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎక్కువగా ఉంది. మన రాష్ట్రంలోనూ మలేరియా భయ పెడుతోంది. మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించేందు కోసం ప్రతి ఏటా ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినం నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించింది.

• నేడు ప్రపంచ మలేరియా దినం

బంగారుపాళెం: మలేరియా అనేది అనాఫిలస్ రకానికి చెందిన దోమ కుట్టడం వల్ల వచ్చే ఒక ప్రాణాంతక వ్యాధి. ఈ దోమ మనిషిని కుట్టే సమయంలో 'ప్లాస్మోడియం' అనే పరాన్నజీవిని మనిషి రక్తంలోనికి పంపుతుంది. ప్లాస్మోడియం పరాన్నజీవులలో ప్రధానంగా నాలుగు రకాలు ఉన్నాయి. వీటిలో ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం పాల్సీఫేరం మనదేశంలో అధికంగా ఉన్నాయి. దోమ వల్ల రక్తంలోనికి చేరిన ప్లాస్మోడియం క్రిమి కాలేయ కణాలను, ఎర్ర రక్త కణాలను నాశనం చేస్తూ తన సంతానాన్ని ఎన్నో రెట్లు పెంచుకుంటుంది. ఈ సమయంలో అది విడుదల చేసే రసాయనాల వల్ల మలేరియా జ్వరం వస్తుంది. చలి, తీవ్రమైన జ్వరం, చెమటపట్టి జ్వరం తగ్గడం జరుగుతోంది. ఇదే లక్షణాలు పునరావృతమవుతూ ఉంటే మలేరియాగా భావించవచ్చు. ఈ వ్యాధి వల్ల రక్తహీనత సమస్య కూడా తలెత్తుతుంది. తగిన సమయంలో గుర్తించి చికిత్స చేయడం చాలా అవసరం. దోమ వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని 'సర్ రోనాల్డ్‌రాస్' అనే బ్రిటీష్ వైద్యుడు కనుగొన్నారు. వంద సంవత్సరాలకు పైగా గడుస్తున్నప్పటికీ ఈ వ్యాధి ఇంకా అదుపులోకి రాలేదు. ప్రధానంగా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దోమల నిర్మూలన చర్యలు తీసుకుంటే మలేరియా బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

మలేరియా లక్షణాలు

మలేరియా దోమ కుట్టిన 10–15 రోజుల తరువాత జ్వరం, తలనొప్పి, చలి వంటి లక్షణాలతో ప్రారంభమవుతుంది. రాత్రాను విపరీతమైన అలసట, మూర్ఛ పోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కళ్లు, చర్మం పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎర్ర రక్త కణాలు విచ్ఛిన్నమైనప్పుడు హిమోగ్లోబిన్ కిడ్నీల ద్వారా బయటకు వస్తే మూత్రం నల్లగా కనిపించవచ్చు. సమస్య తీవ్రమైతే కాలేయం, కిడ్నీలు, మెదడు వంటి అవయవాలూ దెబ్బతినవచ్చు.

మలేరియా నివారణ మార్గాలు

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం తప్పనిసరి. నివాస ప్రదేశాల చుట్టూ నీటి నిల్వలు, చెత్త, చెదారం లేకుండా చూడాలి. అనాఫిలస్ దోమలు నీటి నిల్వల్లో గుడ్లు పెడుతాయి. దోమకాటు నుంచి రక్షించుకునేందుకు శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను ధరించాలి. దోమతెరలు ఉపయోగించాలి. దోమల నివారణకు పొగ వేయడం లేదా మందులు గానీ చల్లాలి. అధిక జ్వరం, వణుకు వచ్చినట్లైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. మలేరియా చికిత్సకన్నా నివారణే మార్గమని గుర్తించాలి. నివాణ మార్గాలు పాటించడం ద్వారా మనల్ని మనం రక్షించుకోవచ్చు.

పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలి

గతేడాది ఒక మలేరియా కేసు నమోదైంది. దోమలు వృద్ధి చెందకుండా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. దోమకాటుకు గురి కాకుండా దోమతెరలు వినియోగించుకోవాలి. మస్కిటో కాయిల్స్, రెపెల్లెంట్స్ వంటివి ఉపయోగించి దోమ కాటుకు గురికాకుండా ఉండవచ్చు. తద్వారా మలేరియా, డెంగీ, బోదకాలు వంటి రోగాలు రాకుండా జాగ్రత్త పడవచ్చు.

–డాక్టర్ లోకేష్, తుంబకుప్పం పీహెచ్‌సీ

నోటీస్ బోర్డు

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

తవణంపల్లె: డీఎస్సీ రాసే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు రీడ్స్ సంస్థ డైరెక్టర్ థియో స్టీఫెన్, కో–ఆర్డినేటర్ కోదండపాణి తెలిపారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఐరాల మండలంలోని సెయింట్ స్టీఫెన్ పబ్లిక్ స్కూల్ క్యాంపస్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇస్తామని, అలాగే అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కూడా కల్పించనున్నట్టు చెప్పారు. శిక్షణానంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. దీనిని జిల్లాలోని డీఎస్సీ పేద అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన సెల్ నంబర్: 9908260007.

30 నుంచి 'మహా భారత' ఉత్సవాలు

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఈ ఏడాది మహాభారత ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఏప్రిల్ 30 నుంచి మే 18వ తేదీ వరకు మహాభారతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. భాగవతార్ వినయ్‌ప్రసాద్‌రెడ్డి 18రోజుల పాటు హరికథాగానం చేస్తారని, మే 8వ తేదీ నుంచి వెంకటేశ్వర నాట్యమండలి (పీలేరు) కళాకారులు నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 30 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే హరికథలు, నాటక ప్రదర్శనల గురించి వివరించారు.

క్లుప్తంగా

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ



ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం మంగసముద్రం హౌసింగ్ కాలనీ ప్రాంతంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను గురువారం జేసీ విద్యాధరి ఆకస్మిక తనిఖీ చేశారు. బియ్యం నిల్వలను పరిశీలించారు. అలాగే తూకం మెషిన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. రికార్డులను చూశారు. రేషన్ షాపులకు సరుకుల సరఫరాపై ఆరా తీశారు. పారదర్శకంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, కార్డుదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని జేసీ పౌరసరఫరాలశాఖ అధికారులకు ఆదేశించారు. తనిఖీలో ఆమె వెంట జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ బాలకృష్ణ, డీఎస్ఓ శంకరన్, డీటీ శ్రీనివాసులు, సిబ్బంది ఎబినైజర్ తదితరులున్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

తవణంపల్లె: నవధాన్యాల సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని పీఎండీఎస్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. గురువారం మండలంలోని ఎగువ తడకరలో నవధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాసు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి సారవంతం అవుతుందని, అంతేకాకుండా ఈ పద్ధతులతో పండించే ఆహారోత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మంచివన్నారు. రసాయన ఎరువులు తగ్గించి జీవన ఎరువులు వాడాలన్నారు. అనంతరం వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఎండీఎస్ అధికారి శివకార్తికేయ, ఎస్ఎఫ్ఏ కవిత, ఎంటీ నీలకంఠారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ సరిత, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



గుణశేఖరన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

యాదమరి: ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన గుణశేఖరన్ సేవలు మరువలేనివని ఎంఈఓ రుక్మిణి అన్నారు. గురువారం ఆమె పాచిగుంటలో మండల ఎస్టీయూ అధ్యక్షులు గుణశేఖరన్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మాట్లాడారు. 42 ఏళ్లు విద్యారంగంలో సేవ చేయడం ఆషామాషీ కాదన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, గంట మోహన్, మదన్‌మోహన్ రెడ్డి, కనకాచారి, రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్టీయూ యూనియన్ సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



ఎన్‌రోల్‌మెంట్ చేస్తున్న ఉపాధ్యాయులు

గుడిపాల: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి గణపతి కోరారు. గురువారం బడి బాట కార్యక్రమంలో భాగంగా చిత్తపార, బండపల్లె, పిళ్లారికుప్పంలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలతోపాటు నిష్ణాతులైన టీచర్లు ఉన్నారన్నారు. ఒక్క రూపాయి ఖర్చులేకుండా పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నట్టు చెప్పారు.

సరకల్లులో 'ఫ్యామిలీ డాక్టర్'

తవణంపల్లె: మండలంలోని సరకల్లులో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

వెంగమాంబపురంలో..



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: మండలంలోని వెంగమాంబపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి రష్మిత రోగులను పరీక్షించారు. ఆ తర్వాత ఇళ్ల వద్ద మంచానికే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, సుమతి, స్వర్ణ, కార్లినా, ప్రవీణ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శించిన సునీల్



ప్రభుత్వ ఆసుపత్రిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

• కూటమి ప్రభుత్వ అండతో రెచ్చిపోతున్న టీడీపీ కార్యకర్తలు
• అక్రమ కేసులు బనాయించేందుకు ఉద్దేశపూర్వకంగా దాడులు

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రావణ్‌కుమార్‌ను గురువారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పరామర్శించారు. మండలంలోని ఎద్దులవారిపల్లె దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబం దాడిచేసింది. ఇది తెలుసుకున్న సునీల్‌కుమార్ నాయకులతో కలసి బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రావణ్‌కుమార్‌ను కలసి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని, గొడవలకు లాగి వారిపై అక్రమ కేసులు బనాయించేందుకు కూటమి ప్రభుత్వం అండతో రెచ్చిపోతున్నారని విమర్శించారు. ఇలాంటి కుత్సిత రాజకీయాలు మంచివి కాదని హితవు పలికారు. రాబోయే కాలంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, నాయకులు కరుణాకర్, మండల యూత్ అధ్యక్షులు గజేంద్ర, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో ప్రత్యేక నిఘా

• పోలీస్ స్టేషన్ తనిఖీలో జిల్లా ఎస్పీ



పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

గుడిపాల: రాష్ట్ర సరిహద్దులో ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. గురువారం గుడిపాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులను, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న బైకులు, వాహనాలను, అలాగే సరిహద్దులో ఏర్పాటు చేసిన 14 సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పోలీస్‌స్టేషన్ రాష్ట్ర సరిహద్దులో ఉండడమే కాకుండా జాతీయ రహదారి కూడా ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని, సరిహద్దు నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేయాలన్నారు. డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. మహిళా పోలీసులు గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి మహిళలకు శక్తి యాప్ ప్రాధాన్యతను వివరించి ప్రతి మహిళ మొబైల్‌లో ఆ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేయించాలన్నారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో సహకార సొసైటీలో ఎరువుల విక్రయం

• రైతులకు విరివిగా రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ గుణశేఖర్

యాదమరి: సహకార సంఘం రుణాలను విరివిగా ఇవ్వనున్నట్టు బ్యాంకు సీఈఓ. గుణశేఖర్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ సహకార భవనంలో సహకార సంఘం సేవలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పర్సన్ ఇన్‌చార్జ్ సులోచన మాట్లాడారు. త్వరలోనే స్థానిక సొసైటీలో ఎరువులను విక్రయిస్తామన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ రుణాలను తక్కువ వడ్డీకే విరివిగా మంజూరు చేస్తున్నామని, ఇప్పటివరకు తీసుకున్న రుణాలను నిర్ణీత గడువు లోపు చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం బ్యాంకు వివిధ రుణాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి చరిత, గిరింపేట డీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ ధనుంజయ రెడ్డి, సిరాజ్ బాషా, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

• మండల సమావేశంలో ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్

ఐరాల: వేసవి దృష్టిలో ఉంచుకుని మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మోహన్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మాజీ వైస్ ఎంపీపీ ధనంజయనాయుడుకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ, గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధి హామీ పథకం పనులు అనుకూలమైన వారికి మాత్రమే ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఏపీఓ జాహ్నవిని ప్రశ్నించారు. వైఖరి ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై ఏపీఓ స్పందిస్తూ మూడు వారాల క్రితమే తాను బాధ్యతలు స్వీకరించానని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏఓ వరలక్ష్మి మాట్లాడుతూ, రబీ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం తగ్గిందని, మండలంలో కేవలం 1028 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారన్నారు. రైతులకు ఉలవలు సబ్సిడీపై ఇవ్వడంతో ఈ మాత్రమైనా సాగు విస్తీర్ణం పెరిగిందని పేర్కొన్నారు. మండలంలో 7,029 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు చెప్పారు. 299 ఎకరాల్లో 254 మంది రైతులకు బిందు, తుంపర సేద్యం పరికరాలు పంపిణీ చేశామన్నారు. వ్యవసాయాధికారి తన కార్యాలయంలో ఎప్పుడు ఉంటారో తెలియడం లేదని, రైతులు ఏ సమయంలో వెళ్లినా కార్యాలయానికి తాళం వేసి ఉంటోందని గుండ్లపల్లె ఎంపీటీసీ లోకేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ రైతు రెండు నెలలుగా సంతకం కోసం ఏఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడని చెప్పారు. దీనిపై ఏఓ స్పందిస్తూ విధుల్లో భాగంగా తాను మండలంలోని ఆర్‌ఎస్‌కే కేంద్రాలను సందర్శించడం వల్ల కార్యాలయంలో ఉండటం లేదని బదులిచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ ధనలక్ష్మి, వైస్ ఎంపీపీలు నిత్య, రోజా, జెడ్పీటీసీ సుచిత్ర, కో–ఆప్షన్ మెంబర్ హారూన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు లత, మమత, విజయకుమారి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని న్యాయస్థాన సముదాయంలో చోరీకి పాల్పడ్డ సురేష్ (31), లెలిన్ కుమార్ (22)ను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ మహేశ్వర్ కథనం.. చిత్తూరు కోర్టు సముదాయంలో బాత్రూములు, ఇతర ప్రాంతాల్లో కొన్ని వస్తువులు చోరీకి గురవుతున్నట్లు అక్కడి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిశీలించిన పోలీసులు గంగాధర్ నెల్లూరు మండలం బాలగంగానపల్లె చెందిన సురేష్, చిత్తూరు మండలం పచ్చనపల్లెకు చెందిన లెలిన్ కుమార్ ఈ చోరీలు చేస్తున్నట్టు తేలింది. వారిని అరెస్టు చేసి న్యాయమూర్తి పరచారు. ఆయన రిమాండ్‌కు ఆదేశించంతో నిందితులను చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

సొసైటీ రుణాలు సద్వినియోగం చేసుకోండి

• డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ రాజు శ్రీవాత్సవ



రైతు రుణాలపై అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ రాజు శ్రీవాత్సవ

బంగారుపాళెం: రైతులు సొసైటీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని బంగారుపాళెం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ రాజు శ్రీవాత్సవ అన్నారు. గురువారం బంగారుపాళెంలో ఏఓ కార్యాలయంలో చంద్రశేఖరపురం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రుణాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ ఇచ్చే వివిధ రకాల రుణాలు, వాటిని ఎలా పొందాలి? ఇందుకోసం రైతులు ఏమేమి పత్రాలు సమర్పించాలో మేనేజర్ వివరించారు. వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ మాట్లాడుతూ, పంటల సాగు కోసం ప్రభుత్వ రుణాలను రైతులు ఉపయోగించుకుని సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చిట్టిబాబు, పీఐసీ బాబు, సూపర్‌వైజర్ రాజశేఖర్, సీఈఓ రామ్మూర్తి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ నాగరాజనాయుడు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

అందరూ కృషి చేస్తేనే గ్రామాభివృద్ధి

గుడిపాల: ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్ అన్నారు. మండలంలోని వసంతాపురం సచివాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సమస్యలు లేని పంచాయతీగా వసంతాపురాన్ని తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమన్నారు. పంచాయతీలో ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని కోరా రు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుందరేషన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బబిత, మహిళా పోలీస్ పావని, డిజిటల్ అసిస్టెంట్ రవీంద్రబాబు పాల్గొన్నారు.



గుడిపాల: సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రజినీకాంత్

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి



ఐరాల: మహాత్మాగాంధీ చిత్రపటానికి పూజలు చేస్తున్న అధికారులు

ఐరాల: గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తూ మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ మోహన్ పిలుపునిచ్చారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ చాలా గొప్పదని, పంచాయతీలు అభివృద్ధి చెందినప్పుడే ఆ వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులు, మండల పరిషత్, జిల్లా పరిషత్ నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి ఎంపీపీ ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డి, ఎంపీడీఓ రెడ్డిబాబు పూజలు చేసి ఘన నివాళులర్పించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డి రాఘవేంద్రరాజ్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో..

ఉగ్ర దాడి మృతులకు నివాళి

బంగారుపాళెం: కాశ్మీర్‌లో ఉగ్రదాడులకు నిరసనగా గురువారం సాయంత్రం బంగారుపాళెంలో బీజేపీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ కొవ్వొత్తులను చేతపట్టుకుని భారత్ మాతాకు జై–ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. విహారయాత్రకు వెళ్లి ఉగ్రమూకల దాడిలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, పర్యాటకులపై ఇలాంటి దాడులు చేసి ప్రాణాలను అమానుషమని, ఉగ్రవాదులు, వారికి అండదండలు అందిస్తున్న పొరుగు దేశానికి కేంద్రం తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో పూతలపట్టు ఇన్‌చార్జి భానుప్రకాష్, మండల నాయకులు గోపిప్రసాద్‌రెడ్డి, రాజేష్, విగేష్, స్థానిక యువకులు పాల్గొన్నారు.

చిత్తూరులో..

చిత్తూరు కార్పొరేషన్: కశ్మీర్లో జరిగిన ఉగ్రవాదుల దాడుల్లో బలైన మృతుల ఆత్మశాంతి కలగాలని సీపీఐ, ఏఐటీయూసీ, ముస్లిం ఐక్యవేదిక, మహిళ సమాఖ్యల నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గురువారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వారిని కేంద్రం వేటాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు మణి, చంద్ర, రమాదేవి, విజయ్‌కుమార్, రషీద్, కుమారి కవిత తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, యువకులు



చిత్తూరులో నివాళి అర్పిస్తున్న నాయకులు